నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, ఆదివారం 15 డిసెంబర్ 2024 | JAGTIAL

## నేడు జగిత్యాలకు ఎమ్మెల్సీ కవిత



జగిత్యాల, డిసెంబర్ 14 : నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆదివారం జిల్లా కేంద్రంలో పర్యటిస్తారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధరూర్ ఎస్సారెస్పీ కాలువ ఎక్స్ రోడ్ వద్ద బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, కార్యకర్తలనుద్దేశించి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ధరూర్ ఎక్స్‌రోడ్ నుంచి జగిత్యాల కొత్త బస్టాండ్ వరకు బైక్ ర్యాలీలో పాల్గొంటారని, తర్వాత తెలంగాణ తల్లి విగ్రహానికి పూలదండ వేస్తారని తెలిపారు.

## రేపటి ప్రజావాణి రద్దు

కలెక్టరేట్, డిసెంబర్ 14 : ఈనెల 16న సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు ప్రభుత్వ శాఖల యంత్రాంగం గ్రూప్-2 పరీక్షల నిర్వహణలో నిమగ్నమై ఉన్నందున ప్రజావాణి నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజావాణికి వచ్చేందుకు సిద్ధమవుతున్న జిల్లా ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు. వచ్చే సోమవారం యధావిధిగా కొనసాగుతుందని వెల్లడించారు.

# హామీల అమలేది?

- సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కార్పొరేషన్/ కలెక్టరేట్, డిసెంబర్ 14: కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చకుండా సబ్బండవర్గాలను ఇబ్బందులు పెడుతున్నదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మండిపడ్డారు. శనివారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని, మాజీ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో ఆరు రోజులుగా చేపట్టిన రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని ఆయన సందర్శించి, మద్దతు పలికారు. ఆయాచోట్ల ఆయన మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి గతేడాది సెప్టెంబర్ 13న హనుమకొండలో ఏకశిల పార్క్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న దీక్ష శిబిరాన్ని సందర్శించి కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వందరోజుల్లో సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి రాగానే విస్మరించారని, దుయ్యబట్టారు. తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అలాగే పల్లెల పురోగతే పరమావధిగా మాజీ సర్పంచులు చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు సత్వరమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు మాజీ సర్పంచులకు ఇచ్చిన హామీ మేరకు బిల్లుల నిధులు విడుదల చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. సర్పంచులకు బిల్లులు చెల్లించడానికి నిధులు లేవంటున్న ప్రభుత్వం, సెక్రటరియేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు పేరిట వందలాది కోట్లు వృథా చేయడం తప్పు కాదా..? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, లేదంటే పెద్ద ఎత్తున భారీ ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

# పంచాయతీ కార్మికుల పోరుబాట

## కాంగ్రెస్ సర్కారుపై రణానికి రెడీ!

- నెల నెలా వేతనాలు అందక ఇబ్బందులు
- అర్ధాకలితో నలిగిపోతున్న కుటుంబాలు
- సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధనకు 17న హైదరాబాద్‌లో మహాధర్నా
- ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 20న సమ్మె నోటీస్
- మల్టీపర్పస్ విధానం రద్దు చేసిపాత కేటగిరీల అమలుకు డిమాండ్

తెల్లారిందే మొదలు ఊరుబాగు కోసం పనిచేస్తూ పల్లెలను అద్దంలా మార్చే పంచాయతీ కార్మికుల జీవితాల్లో కాంగ్రెస్ సర్కారు చీకట్లు నింపుతున్నది. రోజంతా పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి లైట్లు, డంప్ యార్డులు, వైకుంఠ ధామాల్లో రెక్కలు ముక్కలు చేసుకుంటున్న శ్రామికులపై చిన్నచూపు చూస్తున్నది. కనీసం నెలనెలా వేతనాలు ఇవ్వకుండా కడుపులు మాడ్చుతూ, కుటుంబాలను రోడ్డున పడేస్తుండగా, పంచాయతీ కార్మికులు రగిలిపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరుబాటకు సిద్ధమవుతున్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేసి పాత కేటగిరీల అమలు చేయాలని, తదితర న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలని 17న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా చేపట్టబోతున్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే 20 తర్వాత ఏ రోజు నుంచైనా సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేస్తున్నారు.



కరీంనగర్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): ప్రతి 500 జనాభాకు ఒక పంచాయతీ కార్మికులు ఉండాలని గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జీవో నంబర్ 51ని తెచ్చారు. సిబ్బంది వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. వేతనం ₹9,500కు పెంచి, ఈ ప్రకారంగానే కార్మికులు, సిబ్బందికి అందిస్తున్నారు. అయితే పలు గ్రామాల్లో కొందరు కార్మికుల వివరాలను ఆన్‌లైన్ చేయలేదు. ఆన్‌లైన్‌లో ఉన్న వారికి ₹9,500 వేతనం చెల్లిస్తుండగా, లేని వారికి ₹8,500 చెల్లిస్తున్నారు. అది కూడా నాలుగైదు నెలలకోసారి ఇస్తుండడంతో కార్మికుల కుటుంబాల్లో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. కొన్ని గ్రామ పంచాయతీల్లో ఒకరి పేరు మీద వచ్చే వేతనాన్ని ఇద్దరు పంచుకుంటున్న పరిస్థితి కనిపిస్తున్నది. ఇలాంటి ఉద్యోగులు మొన్నటి వరకు ఉన్న సర్పంచుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి పనిచేశారు. ఇప్పుడు ప్రత్యేకాధికారుల పాలన నడుస్తున్న నేపథ్యంలో వీరి గురించి పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. చిన్న గ్రామ పంచాయతీల్లో ఏడెనిమిది నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. చెల్లించేదే అతి తక్కువ వేతనాలు, అందులో ఐదారు నెలలకు ఒకసారి ఇస్తే తాము బతికేదెలా..? అని గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

### ఎన్నో డిమాండ్లు

ఇప్పటి వరకు ఉన్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి అంతకు ముందు ఉన్న కేటగిరీల వారీగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్మికులు, సిబ్బంది ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. అంతే కాకుండా తమ బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, తమ వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని కోరుతున్నారు. 2వ పీఆర్సీ పరిధిలోకి తమను తీసుకురావాలని, జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు కేటగిరీల వారీగా చెల్లించాలని విన్నవిస్తున్నారు. జీవో నంబర్ 51 రద్దు చేసి పాత కేటగిరీలన్నింటినీ కొనసాగిస్తూ కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కింద ₹5లక్షలు చెల్లించాలని, ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని కోరుతున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు కాని కార్మికుల పేర్లను నమోదు చేసి నేరుగా, వారికి కూడా వేతనాలు చెల్లించాలని, పంచాయతీల అవసరాల ప్రతిపాదికన కార్మికుల సంఖ్యను పెంచాలని కోరుతున్నారు. కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్ల స్థలాలు కేటాయించాలని, చనిపోయినా, అనారోగ్యానికి గురైన కార్మికుల కుటుంబాల సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు.

### 17న చలో హైదరాబాద్

ఉద్యోగ భద్రత కరువై చాలీ చాలని వేతనాలతో కాలం గడుపుతున్న పంచాయతీ కార్మికులకు గత ప్రభుత్వ హయాంలో వేతనం ₹9,500కు పెరిగింది. ఈ వేతనాలను ప్రస్తుత ప్రభుత్వం కనీసం నెల నెలా ఇవ్వని పరిస్థితి నెలకొన్నది. రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా సకాలంలో వేతనాలు అందని కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి కుటుంబాలు గడుపుకుంటున్నారు. పిల్లలకు సరైన విద్యను అందించలేక పోతున్నారు. గ్రామీణ ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులు అనారోగ్యాల పాలవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్మికులు, సిబ్బంది ఆందోళన బాట పడుతున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సిబ్బంది ఈ నెల 17న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అక్కడి ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా చేయనున్నారు. అందుకోసం సోమవారం అన్ని మండలాల ఎంపీడీవోలకు, జిల్లా పంచాయతీ అధికారికి వినతి పత్రాలు అందిస్తున్నారు. ధర్నా తర్వాత కూడా ప్రభుత్వం స్పందించకపోతే 20న సమ్మె నోటీసు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు. 20 తర్వాత ఏ రోజు నుంచైనా సమ్మెలోకి వెళ్లేందుకు పంచాయతీ సిబ్బంది, కార్మికులు జేఏసీ ఆధ్వర్యంలో సంసిద్ధులవుతున్నారు. వీరికి టీజీకేఎస్‌యూ, సీఐటీయూ, ఏఐటీయూసీ, టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ వంటి కార్మికుల సంఘాలు, తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్, బిల్ కలెక్టర్ల సంఘాల ఆధ్వర్యంలో ఏర్పడిన జేఏసీ అండగా నిలుస్తున్నది. ఇప్పటికే కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అనేక సార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసింది.

### డిమాండ్లపై స్పందించాలి



మా న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలి. పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బంది అర్ధాకలితో అలమటిస్తున్నరు. కుటుంబాలను గడుపుకోవడానికి ప్రతి నెలా అప్పులు చేస్తున్నరు. అతి తక్కువ వేతనాలు ఇస్తున్నా కనీసం నెలకోసారైనా చెల్లించే పరిస్థితి లేదు. మేం ఎట్లా బతకాలి? ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి. లేదంటే సమ్మెకు దిగక తప్పదు.

**- బుడిగె అంజయ్య, జేఏసీ తిమ్మాపూర్ మండల కన్వీనర్**

# తాళ్లతో కట్టేసి.. బంగారం ఎత్తుకెళ్లి

- బీర్‌పూర్‌లో దొంగల బీభత్సం
- దంపతులపై దాడి.. బాత్‌రూంలో నిర్బంధం
- పదితులాల ఆభరణాలు అపహరణ
- తెల్లవారు జామున ఘటన



దొంగల చేతిలో గాయపడిన ఈశ్వరయ్య

సారంగాపూర్, డిసెంబర్ 14 : బీర్‌పూర్ మండల కేంద్రంలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఓ ఇంట్లో దంపతులను తాళ్లతో కట్టేసి, బంగారు నగలు, నగదును ఎత్తుకెళ్లారు. పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున ఓ నలుగురు దుండగులు మంకీ క్యాప్‌లు ధరించి బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన వ్యాపారి కాసం ఈశ్వరయ్య ఇంటి ఆవరణలోకి వచ్చారు. ఐదు గంటలకు ఈశ్వరయ్య కాలకృత్యాలు తీర్చుకునేందుకని ఇంటి బయట ఉన్న బాత్‌రూమ్‌కు వెళ్లాడు. తిరిగి బాత్‌రూం నుంచి బయటకు వచ్చి ఇంట్లోకి వెళ్తున్న ఈశ్వరయ్యపై ఆ నలుగురు దాడి చేశారు. నోరుమూసి ఇంట్లోకి లాక్కెళ్లి తాళ్లతో కట్టేశారు. తుపాకీతో తలపై బాదారు. డబ్బులు ఇవ్వాలని అడుగగా, ఆయన లేవని చెప్పడంతో మెడలో ఉన్న గొలుసు, చేతి బ్రాస్‌లెట్, ఉంగరం లాక్కున్నారు. మరో గదిలోకి వెళ్లి ఈశ్వరయ్య భార్య మెడలో ఉన్న పుస్తెల తాడు, కాళ్ల పట్టీలు, మట్టెలు తీసుకొని, నోరు తెరవకుండా చేసి బాత్‌రూంలో బంధించారు. ఈ విషయం ఎవరికైనా చెప్పితే చావు తప్పదని హెచ్చరించారు. ఇంతలోనే బయటి నుంచి పని మనిషి వచ్చి పిలవడంతో దొంగలు వెనుక నుంచి పారిపోయారు. పది తులాల బంగారు ఆభరణాలు, పది వేల నగదు ఎత్తుకెళ్లినట్టు బాధితులు వాపోయారు. ఈశ్వరయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ కుమారస్వామి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెల్సుకున్నారు. పోలీసులు క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో గాలించారు. దొంగలు బైక్‌లపై పారిపోయారనే సమాచారంతో మండలంలో గాలింపు చర్యలు చేపట్టారు.

## నేడు, రేపు గ్రూప్-2 పరీక్షలు

కరీంనగర్ కలెక్టరేట్, డిసెంబర్ 14 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో రెండు రోజుల పాటు గ్రూప్ 2 ఎగ్జామ్స్ జరుగనున్నాయి. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు ఉండనున్నాయి. అభ్యర్థులను ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు మాత్రమే లోనికి వెళ్లేందుకు అనుమతించనున్నారు. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలని, టీజీపీఎస్సీ నిబంధనలు కచ్చితంగా పాటించాలని అధికారులు సూచించారు.


# కలిసికట్టుగా పని చేద్దాం

- బీఆర్ఎస్‌ను బలోపేతం చేద్దాం
- పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు పిలుపు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, వేదికపై ఎమ్మెల్సీ రమణ, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, డిసెంబర్ 14 : కలిసికట్టుగా పని చేసి బీఆర్ఎస్‌ను బలోపేతం చేద్దామని పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన పట్టణ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, అన్ని వర్గాల వారితో సమన్వయ కమిటీ వేసుకొని వార్డుల వారీగా పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ప్రభుత్వ సర్వేలు, మీడియా సంస్థలు నిర్వహిస్తున్న సర్వేల్లోనూ వ్యతిరేకత వచ్చిందని పేర్కొన్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలను పార్టీ గుర్తు పెట్టుకుంటుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని ఇటీవల రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఇచ్చిన నివేదికలో వెల్లడైందన్నారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలు, నాయకులతో వార్డుల వారీగా సమన్వయ కమిటీ ఏర్పర్చుకొని పార్టీ కోసం కష్ట పడే వారికి అవకాశం కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, ప్రధాన కార్యదర్శి అల్లాల ఆనంద్‌రావు, కౌన్సిలర్లు దేవేందర్ నాయక్, అవారి శివకేసరి బాబు, సమిండ్ల వాణి శ్రీనివాస్, వొల్లెం మల్లేశం, ఏఎంసీ మాజీ చైర్మన్ శీలం ప్రియాంక, మైనారిటీ నాయకులు అమీన్‌బాయ్, ప్రతాప్, భగవాన్, రహమాన్, వొల్లాల గంగాధర్, నక్క గంగాధర్ పాల్గొన్నారు.



# క్రెడిట్ కార్డులు స్వైప్ చేసి..

- ₹34 లక్షలు వాడుకొని ఉడాయించిన ఘనుడు
- న్యాయం చేయాలంటూ బాధితుల ఆందోళన

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 14 : తల్లికి ఆరోగ్యం బాగాలేదని నమ్మించి 15 మంది స్నేహితుల క్రెడిట్ కార్డులు వాడుకున్నాడు. ఒకరికొకరికి తెలియకుండా కార్డులు తీసుకొని మొత్తం ₹34 లక్షలు స్వైప్ చేసుకున్నాడు. డబ్బులు కట్టాలని చెప్పినా చెల్లించకుండా ఎవరికీ కనపడకుండా ఉడాయించాడు. దీంతో తమ డబ్బులిప్పించాలంటూ బాధితులు మోసం చేసిన వ్యక్తి ఇంటి ఎదుట ఆంగోళనకు దిగారు. బాధితుల కథనం ప్రకారం.. జగిత్యాల పట్టణానికి చెందిన కల్లం ఆదిత్యరెడ్డి స్థానికంగా ఓ కార్పొరేట్ కంపెనీకి చెందిన సెల్ దుకాణంలో పనిచేస్తున్నాడు. తల్లి, భార్యకు ఆరోగ్యం బాగా లేదని వైద్యం కోసం డబ్బులు అవసరమని నమ్మించి 15 మంది స్నేహితులకు చెందిన క్రెడిట్ కార్డుల ద్వారా ₹34 లక్షలకు పైగా స్వైప్ చేశాడు. తర్వాత కార్డు డబ్బులు కట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, రెండు నెలల నుంచి ఎవరికీ కనపడకుండా తప్పించుకు తిరుగుతున్నాడని బాధితులు వాపోయారు. బ్యాంకులకు వడ్డీలు కట్టడం ఇబ్బందికరంగా మారిందని, ఈ విషయమై ఇంట్లోనూ గొడవలు జరుగతున్నాయని, ఆదిత్యను కుటుంబీకులే దాచిపెట్టారని, తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం జగిత్యాల టౌన్ పోలీసులను ఆశ్రయించారు.



భోజనం చేస్తూ విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

# ఇదేం బగారన్నం?

- దీనికంటే తెల్ల అన్నం నయం
- కామన్‌డైట్ ప్రారంభోత్సవం రోజే ఇలా చేస్తే ఎలా..?
- మరోసారి పునరావృతం కావద్దు
- పెద్దాపూర్ గురుకుల బాలుర పాఠశాలలో జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్

మారుతీనగర్, డిసెంబర్ 14: 'ఇది బగార అన్నమా..? దీనికంటే తెల్ల అన్నమే బాగుండేది. కామన్ డైట్ కార్యక్రమం ప్రారంభం రోజే భోజనం ఇలా ఉంటే ఎలా..?' అని పెద్దపూర్ బాలుర గురుకులంలో వంట మనుషులపై కలెక్టర్ సత్యప్రసాద్ ఆగ్రహించారు. విద్యార్థులకు భోజనం అందించే విషయంలో అప్రమత్తంగా ఉండాలని భోజనశాల ఇన్‌చార్జిని హెచ్చరించారు. మరోసారి ఇలా జరుగకుండా చూసుకోవాలని పెద్దాపూర్ గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ మాధవీలతకు సూచించారు. శనివారం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో కామన్ డైట్ ప్రోగ్రాం ప్రారంభం కాగా, కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం ఎలా ఉందో..? అడిగి తెలుసుకున్నారు. విద్యా బోధనపైనా ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రతి నెలా పిల్లలను చూసేందుకు వచ్చే తల్లిదండ్రుల్లో కనీసం ఐదుగురికైనా భోజనం ఎలా ఉందో..? తెలుసుకునేందుకు తినే అవకాశం కల్పించాలని సూచించారు. ఇక్కడ వైస్ ప్రిన్సిపాల్ మైపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# ఖర్చెవరిది?

- కామన్ డైట్ ఆర్భాటం
- పైసా విదిల్చని రాష్ట్ర సర్కారు!
- సీఎం, డిప్యూటీ సీఎంల ఫొటోలతో ఫ్లెక్సీతోనే సరి
- ఎవరి జేబులోంచి పెట్టాలని అధికారుల్లో ఆందోళన!
- విద్యార్థుల చార్జీల నుంచే కోత విధిస్తారని చర్చ



సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని చిత్రవేణి గూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో భోజనం చేస్తున్న అధికారులు

'కామన్ డైట్' కార్యక్రమాన్ని ఆర్భాటంగా ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం మొదటి రోజు కార్యక్రమానికి మాత్రం పైసా విదిల్చలేదని తెలుస్తున్నది. కేవలం సీఎం, డిప్యూటీ సీఎంల ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీని మాత్రమే పంపించి చేతులు దులుపుకున్నట్లు సమాచారం. ఒక్కో పాఠశాలలో వందల మందికి భోజనాలు, ఇతర అవసరాల కోసం పెట్టిన ఖర్చులు ఎవరి జేబుల్లోంచి పెట్టాలన్న ఆందోళన అధికారుల్లో నెలకొన్నది. విద్యార్థుల మెనూ, కాస్మొటిక్ చార్జీల నుంచే కోత విధిస్తారన్న చర్చ జరుగుతున్నది.

పెద్దపల్లి, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ) : కామన్ డైట్ ప్రోగ్రాంలో భాగంగా మార్చిన మెనూను తెలిపేందుకు ప్రభుత్వం శనివారం రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించింది. అందులో భాగంగా, ఒక్కో హాస్టల్‌లో ముఖ్యమంత్రి మొదలుకొని మంత్రులు, వీవీఐపీలు, వీఐపీలు, రాష్ట్ర అధికారులు, జిల్లా అధికారులు, తల్లిదండ్రులు పాల్గొనే విధంగా రూపొందించింది. ప్రతి హాస్టల్‌కు ఒక ఫ్లెక్సీని పంపించి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే, కార్యక్రమ నిర్వహణకు ఏ ఒక్క సంక్షేమ హాస్టల్‌కు ప్రభుత్వం ఒక్క రూపాయిని కూడా కేటాయించలేదని తెలిసింది. ఒక్కోచోట 500 నుంచి 600 మందికి చికెన్‌తో భోజనాలు, ఇతర వంటలు, అరటి పళ్లు, బిస్కెట్లు, టీలు, ఇతర ఖర్చుల కోసం విద్యార్థుల మెనూ చార్జీల నుంచే కోత పెట్టనున్నట్టు తెలుస్తున్నది. అదనంగా అయిన ఖర్చులు ఆయా సంక్షేమ హాస్టళ్లు నిర్వహిస్తున్న ప్రిన్సిపాళ్ల జేబులో నుంచి ఖర్చు చేసినట్లు సమాచారం. విద్యార్థుల మెనూ చార్జీల నుంచి ఖర్చు చేస్తే నెలలో నాలుగు సార్లు పెట్టే మాంసాహారం, అరటి పళ్లు, బిస్కెట్లు, ఇతర ఆహార పదార్థాల్లో కోత విధించే ప్రమాదం ఉన్నది. మొదటి రోజు కార్యక్రమంలో వంటలు చేయడానికి అయ్యే గ్యాసు, ఇతర ఖర్చులు వసతి గృహాల క్యాటరింగ్ కాంట్రాక్టర్లు, తినడానికి అందజేసిన యూజ్ అండ్ త్రో ప్లేట్స్, గ్లాసులు, వేదికలు, టెంట్లు, మైక్‌లు, కుర్చీల రెంట్లు ఇతర ఖర్చులన్నీ ఆయా గురుకులాలు, ఇతర సంక్షేమ పాఠశాలలు, హాస్టళ్ల అధ్యాపకులే భరించినట్లు తెలిసింది. ప్రభుత్వం ఒక కార్యక్రమం చేపట్టినప్పుడు ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా ఇలా ఆర్భాటాలకు పోవడం విమర్శలకు తావిస్తున్నది.

### ఖర్చులు ఇవ్వరంట

ప్రభుత్వం కామన్ మెనూ డైట్‌కు సంబంధించి లాంచింగ్ కార్యక్రమానికి ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వలేదు. క్యాటరింగ్ చార్జెస్, అదనంగా గ్యాస్ చార్జెస్, మ్యాన్‌పవర్ ఖర్చులు ఇవ్వమని చెబుతున్నారు. ఇదేమంటే స్వచ్ఛందంగా భరించాలంటున్నారు. చాలా మంది బయటికి చెప్పడం లేదు. ప్రిన్సిపాళ్లు కూడా చాలా బాధ పడుతున్నారు.

**-కూర శ్రీనివాస్, బీసీ గురుకులాల క్యాటరింగ్ కాంట్రాక్టర్ (పెద్దపల్లి)**